క్లుప్తంగా

నేడు గృహసారథుల సమావేశం

గుర్రంకొండ: మండలకేంద్రంలో మంగళవారం గృహసారథులు, సచివాలయల కన్వీనర్ల సమావేశం నిర్వహించనున్నట్లు మండల సచివాలయల కన్వీనర్ చింతిర్ల నాగేంద్ర తెలిపారు. స్థానిక గోల్డెన్ ప్లాజా కళ్యాణ మండపంలో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. సమావేశానికి పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, గృహసారథులు, సచివాలయల కన్వీనర్లు తప్పక హాజరు కావాలని కోరారు.

ఆర్టీసీకి పెరిగిన ఆదాయం

మదనపల్లె సిటీ: శివరాత్రి పండుగ పురస్కరించుకుని మదనపల్లె ఆర్టీసీ 1,2 డిపోలు శైవక్షేత్రాలను ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపారు. దీంతో ఆర్టీసీని ఆదాయం పెరిగినట్లు డీఎంలు మూరే వెంకటరమణారెడ్డి, ఆర్సీ నిరంజన్ తెలిపారు. మదనపల్లె నుంచి తంబళ్లపల్లె మల్లయ్యకొండ, అంగళ్లు మల్లయ్యకొండలకు ప్రత్యే క బస్సు సర్వీసులు నడపడం వల్ల ఈపీకె 91.75, ఓఆర్ 171 వచ్చి జిల్లాలో మొదటి స్థానం నిలిచినట్లు తెలిపారు. టు డిపో నుంచి మదనపల్లె నుంచి ఝరికి రూ.3,71,401, తవళం నేలమల్లేశ్వరస్వామి ఆలయంకు రూ.2,54,962 ఆదాయం వచ్చినట్లు చెప్పారు. సిబ్బంది కృషితో ఆదాయం పెరిగినట్లు తెలిపారు.

పాఠశాల తనిఖీ

నిమ్మనపల్లె : మండల పరిధిలోని అగ్రహారం ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ రాజగోపాల్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. మెనూ ప్రకారం నాణ్యతతో జగనన్న గోరుముద్ద విద్యార్థులకు అందించాలని సూచించారు. మధ్యాహ్నం భోజన నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయ సంక్షేమ విద్యాసహాయకులు జావిద్‌బాషా, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిట్స్ ప్రొఫెసర్‌కు యువ రచయిత అవార్డు

కురబలకోట: మండలంలోని అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల సీఎస్ఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ కుంట ముక్కల మంజు ప్రీతం 'తనేగా ప్రాణం' పుస్తకం రాసినందుకు మదనపల్లె ప్రజా చైతన్య స్రవంతి వారు యువ రచయిత అవార్డు అందజేశారు. కళాశాల కరస్పాండెంట్ ఎన్. విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదేళ్ల సోమవారం అభినందించారు. రచయిత మంజు ప్రీతం మాట్లాడుతూ పుస్తకంలో 55 కవితలు రాసినట్లు తెలిపారు.

ఎర్రబల్లె ఆసుపత్రికి పెళ్లి రోజు కానుక

కురబలకోట: సాధారణంగా మొదటి పెళ్లి రోజును ఘనంగా జరుపుకోవాలని ఆశించడం సహజం. మండలంలోని ఎర్రబల్లె సచివాలయ పరిధిలోని కంటేవారిపల్లెకు చెందిన సుకన్య, అమర్‌నాథ్ దంపతులు వినూత్నంగా ఆలోచించారు. ఎర్రబల్లెలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల సౌకర్యం కోసం సోమవారం మంచం, పరుపు విరాళంగా అందజేశారు. వీరిని గ్రామస్తులు, ఆరోగ్య సిబ్బంది అభినందించారు.

వృద్ధుడిపై దాడి.. కేసు నమోదు

ములకలచెరువు: మండలంలోని బురకాయల కోట పంచాయతీ యర్రమాసివారిపల్లెకు చెందిన వై.శంకర్‌నాయుడు (58)ను అదే గ్రామానికి చెందిన సమీప బంధువు వై. శ్రీనివాసులు ఆర్థిక వ్యవహారాల కారణంగా ఆదివారం రాత్రి దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన వృద్ధుడిని చికిత్స నిమిత్తం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వృద్ధుడి భార్య వై. ధనమ్మ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారించిన ఏఎస్ఐ నజీర్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఘనంగా వీరభద్రస్వామి తిరునాల



స్వామి వారి గొడుగును అలంకరించిన దృశ్యం

ములకలచెరువు: మండలంలోని సోంపల్లి పంచాయతీ బత్తినవారిపల్లెలో వెలసిన శ్రీ వీరభద్రస్వామి వారి తిరునాలను సోమవారం స్థానికులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి గొడుగు వీధుల్లో ఊరేగించారు. వాల్మీకులు నిర్వహించిన కత్తిసాము అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు.

జీవన ప్రమాణాల పెంపుతో ప్రగతి

తంబళ్లపల్లె: స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని జీవన ప్రమాణాల పెంపుతో ప్రగతి సాధించాలని బ్యాంకు లింకేజి (డీపీఎం) ప్రసాద్‌రెడ్డి కోరారు. సోమవారం స్త్రీశక్తి భవన్‌లో బ్యాంకు రుణాల వినియోగం, సాధించిన ప్రగతి అంశాలపై సూర్య స్వయం సహాయక సంఘం, సరస్వతి, ఎస్‌హెచ్‌జి తులసీ, స్వయం సహాయక సంఘాల లీడర్లు, సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

మదనపల్లెలో మోడల్ బస్‌స్టేషన్

- ఆధునికీకరణకు అధికారుల కసరత్తు
- ప్రయాణికులకు మెరుగైన సేవలు
- పీపీపీ కింద అప్పగింత

బస్టాండ్ ఏర్పాటు	1975
విస్తీర్ణం ఎకరాల్లో	4.50
డిపోల సంఖ్య	02
రెండు డిపోల్లో బస్సులు	210
నెలసరి ఆదాయం రూ.లక్షల్లో	13



మదదనపల్లె ఆర్టీసీ బస్టాండు

మదనపల్లె సిటీ : జిల్లాలో అతి పెద్ద ఆర్టీసీ బస్టాండు మదనపల్లె. ఇక్కడ రెండు డిపోలున్నాయి. డిపో ఏర్పాటు చేసినప్పటి నుంచి ఆధునికీకరణకు నోచుకోలేదు. ప్రయాణికులకు మెరుగగైన సేవలు అందించాలన్న లక్ష్యంతో ఆర్టీసీ అధికారులు కసరత్తులు ప్రారంభించారు. ఈనేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 420 బస్టాండ్లలో తొలివిడతగా 100 ఆధునికీకరించనున్నారు. ఇందులో భాగంగా 1975 నిర్మించిన మదనపల్లె బస్టాండును మోడల్ బస్‌స్టేషన్‌గా మార్పు చేయనున్నారు. సుమారు 4.50 ఎకరాలు స్థలం ఉంది. స్థలం ఎక్కువగా ఉండటంతో బస్టాండులో వన్, టు డిపో కార్యాలయాలు, బస్టాండు, డిపో గ్యారేజీలు ఏర్పాటు చేశారు. 19 ప్లాట్ ఫారంలు ఉన్నాయి. రెండు డిపోల్లో 210 బస్సులు నడుస్తున్నాయి. బస్టాండుకు నిత్యం వేలాది మంది ప్రయాణికులు వస్తుంటారు. కర్ణాటక, తమిళనాడు తోపాటు పొరుగు జిల్లాల నుంచి ప్రయాణికులు అధికంగా వస్తారు. బస్టాండు ద్వారా నెలసరి ఆదాయం రూ.13 లక్షలు వస్తోంది. బస్టాండులోని ఖాళీ స్థలాలను పీపీపీ (ప్రైవేటు పబ్లిక్ పార్టిసిపేషన్) కింద 33 ఏళ్ల పాటు లీజుకు ఇచ్చేందుకు అధికారులు సన్నద్ధం చేస్తున్నారు. ప్రస్తుత బస్టాండు ఆవరణంలో కొత్తగా ప్లాట్‌ఫారాలు, ప్రయాణికులు నిరీక్షించేందుకు గదులు, కంట్రోల్ రూం, వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టడం, నిఘా కెమరాలు ఏర్పాటు చేయడం, డిపో కార్యాలయాలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంటుంది. ఇందుకుగాను లీజుకు తీసుకున్న వారికి కాంప్లెక్స్ ఆవరణంలో వ్యాపారం చేసుకునేందుకు వీలు కల్పిస్తారు.

> **త్వరలో ఆర్టీసీ స్థలాల లీజుపై సమావేశం**
>
> 
>
> మదనపల్లె ఆర్టీసీ బస్టాండులో స్థలాలు లీజుకిచ్చే అంశంపై త్వరలో సమావేశం నిర్వహించనున్నాం. పారిశ్రామికవేత్తలు, రవాణారంగంలో అనుభవం కలిగినవారు, వ్యాపారులను ఆహ్వానించి సలహాలు తీసుకుంటాం. పీపీపీ కింద ప్రైవేటు వ్యక్తులు లేదా సంస్థలను ఆహ్వానిస్తున్నాం.
>
> – ఆర్సీ నిరంజన్, డిపో-2 మేనేజర్, మదనపల్లె

యువత చేతిలోనే దేశ భవిష్యత్తు

– డీఎస్పీ కేశప్ప



మాట్లాడుతున్న డీఎస్పీ కేశప్ప

మదనపల్లె : యువత చేతిలోనే దేశభవిష్యత్తు ఉందని, మంచి క్రమశిక్షణ, ఉత్తమ నడవడిక, చక్కటి ఆరోగ్యం, జ్ఞానంతో కూడిన చదువుతో ప్రతి ఒక్కరూ ఉన్నతస్థితికి చేరుకోవాలని డీఎస్పీ కేశప్ప తెలిపారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు పట్టణంలోని శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో సోమవారం మాదకద్రవ్యాలు, వాటివల్ల కలిగే అనర్థాలపై యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ సెమినార్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుకునే దశలో ఎలాంటి మత్తు పదార్థాలకు బానిస కాకుండా తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చేందుకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకుంటోందన్నారు. టూటౌన్ సీఐ మురళీకృష్ణ, రూరల్ సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత మేధస్సు, ఆలోచనాశక్తి నిర్వీర్యమవడమే కాకుండా అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందన్నారు. జీవితం ఎంతో విలువైనదని, చెడువ్యసనాలు, దురలవాట్లతో చేజేతులా భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ వీఎస్ఆర్.సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాసెసింగ్ టమాటాతో రైతుకు లాభాల పంట

మదనపల్లె : ప్రాసెసింగ్‌కు అనువైన టమాటా రకాలను సాగు చేయడంతో రైతులు నష్టపోకుండా మంచి లాభాలు పొందవచ్చని హార్టికల్చర్ అధికారి ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ప్రాసెసింగ్ టమాటా రకాలపై అవగాహన కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల, జీవనోపాధి మెరుగుదల ప్రాజెక్ట్(ఏపీఐఎల్ఐపీ) కింద మదనపల్లె, నిమ్మనపల్లె మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామన్నారు. ప్రాసెసింగ్ టమాటాను వాడుకభాషలో రైతులు సీడ్‌కాయ లేదా కోలార్‌కాయ అని పిలుస్తారన్నారు. వీటి సాగు మనజిల్లాలో లేదని, కర్ణాటకలోని కోలార్, చింతామణి జిల్లాల్లో అధికంగా ఉందన్నారు. కండశాతం ఎక్కువగా ఉండటం, జ్యూస్, సాస్ చేసేందుకు అనుకూలంగా ఉండటమే కాకుండా రోజువారీ వాడకానికి చక్కగా ఉపయోగపడతాయన్నారు. మార్కెట్లో హెచ్చుతగ్గులతో టమాటా కొనుగోలు ధరలు తగ్గినప్పటికీ, ప్రాసెసింగ్ కంపెనీల ద్వారా మార్కెటింగ్ చేయించి రైతులు నష్టపోకుండా చేయవచ్చన్నారు. ప్రాసెసింగ్ టమాటా సాగు చేసినందుకు రైతుకు పెట్టుబడి రాయితీగా ఒక ఎకరాకు రూ.21, 400 సబ్సిడీ ఇస్తున్నామన్నారు. కుప్పం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్రాసెసింగ్ రకాలైన సింజెంటా-6242, అన్‌సోల్, జివెల్ అందుబాటులో ఉన్నాయన్నారు. కావాల్సిన రైతులు ఒక మొక్కకు రూ.1.25 చొప్పున సబ్సిడీ రూపాయి పోనూ మిగిలిన 25 పైసలు చెల్లించి నారు తెచ్చుకుని సాగుచేసుకోవచ్చన్నారు. అలాగే మల్చింగ్ పేపర్‌కు రూ.6,400, ఐపీఎం కింద ఎకరాకు రూ.2,000, కాయలు మార్కెటింగ్ చేసుకునేందుకు ప్లాస్టిక్ క్రేట్స్ ఒకొక్కటి రూ.120 చొప్పున ఎకరాలకు 40 క్రేట్స్ సబ్సిడీపై ఇస్తామన్నారు. రైతులు సమీప రైతుభరోసా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

'స్పందన' ఫిర్యాదులను పరిష్కరించండి

– ఆర్డీఓ ఎం.ఎస్.మురళి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

మదనపల్లె : ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం సబ్‌కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన కార్యక్రమంలో ప్రజలు సమర్పించే అర్జీలను సత్వరమే పరిష్కరించేలా సంబంధిత అధికారులు చొరవ చూపాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి అన్నారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన స్పందన కార్యక్రమంలో ఆర్డీఓ ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించి సమస్యలను తెలుసుకున్నారు. పరిష్కారానికి సంబంధించి సంబంధిత అధికారులకు రెఫర్ చేశారు. స్పందన ఫిర్యాదుల్లో అధికశాతం సివిల్, భూతగాదాలు, అన్నదమ్ముల మధ్య భాగపరిష్కారాలు, సర్వే సమస్యలు, పాసుబుక్కుల మంజూరు, దారి సమస్యలపై వచ్చాయి. మున్సిపాలిటీలో జరిగిన స్పందన కార్యక్రమంలో కమిషనర్ ప్రమీల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అగడ్తవీధిలో దౌర్జన్యంగా ఇళ్లు కడుతున్నారని, 8వవార్డులో మురుగునీటి కాలువ రిపేరి చేయాలని, పోతబోలు లేఅవుట్‌లో నీటిట్యాంకు కట్టాలని, రామారావు కాలనీ ఆటోస్టాండ్ దగ్గర డ్రైనేజీలో పాములు వస్తున్నాయంటూ ఫిర్యాదులు అందాయి.

వైభవంగా శ్రీవాలీశ్వరస్వామి రథోత్సవం

రామసముద్రం: రామసముద్రం మండలం ఆర్.నడిపల్లె పంచాయతీ బల్లసముద్రం కొండపై వెలసిన శ్రీవాలీశ్వరస్వామి రథోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు , వేదపండితులచే హోమాలు ఘనంగా చేశారు. చుట్టుపక్కల ప్రాంతాల భక్తులే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు కొండపైకి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అంతేకాకుండా హర.. హర..మహదేవా అంటు వాలీశ్వరస్వామి రథోత్సవంలో పాల్గొన్నారు. అలాగే గుంతయంబాడిలోని శ్రీపుండరీశ్వరస్వామి , రామసముద్రంలోని శ్రీచంద్రశేఖరస్వామి, వాలీశ్వరస్వామి ఆలయాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

పీటీఎంలో ముగిసిన రథోత్సవం

పెద్దతిప్పసముద్రం: మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీ పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో గత రెండు రోజుల నుంచి పూజలు, అభిషేకాలు, కల్యాణోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు సనగరం పట్టాభిరామయ్య, ఆకుల మల్లికార్జునల ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సోమవారం జరిగిన స్వామి వారి రథోత్సవ వేడుకలు కనుల పండువగా సాగాయి. వేద పండితులు ఉత్సవ మూర్తులను ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించారు. శివనామ స్మరణలతో గ్రామ పుర వీధులు మార్మోగాయి. బళ్లారి డ్రమ్ముల శబ్దాలు, కోలాటలతో భక్తులు ఉత్సాహంగా రథోత్సవం నిర్వహించారు. ప్రధానంగా మల్లయ్యదారుల వేషాధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అదే విధంగా రుద్రాభిషేకం, వసంతోత్సవం, ఊంజల్ సేవ, శయనోత్సవం కార్యక్రమాలను చూపరులను ఆకట్టుకునే విధంగా నిర్వహించారు.



ఉట్ల తిరునాల నిర్వహిస్తున్న దృశ్యం



పెద్దతిప్పసముద్రంలో రథం లాగుతున్న దృశ్యం


ఏకసభ్య కమిటీ వేర్వేరుగా వినతులు స్వీకరించాలి

మదనపల్లె : వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణ బిల్లు విషయమై అధ్యయనం చేసేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శ్యామూల్స్ ఆనంద్‌కుమార్ ఏకసభ్య కమిటీ వాల్మీకుల నుంచి, ఎస్టీ జాబితాలోని జాతుల నుంచి వేర్వేరుగా వినతులు స్వీకరించాలని ఆ సంఘం నాయకులు పులిశ్రీనివాసులు విన్నవించారు. సోమవారం ఆర్డీఓ ఎం.ఎస్.మురళిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘం నాయకులు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిపక్షనేత హోదాలో నిర్వహించిన ప్రజా సంకల్పపాదయాత్రలో వాల్మీకులు ఇచ్చినటువంటి వినతులను పూర్తిగా అధ్యయనం చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. వాల్మీకులు, ఎస్టీ జాబితాలోని జాతులు మధ్య ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సామరస్యంగా పరిష్కారం జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో కొత్త ఉడుం శంకర, సద్దల జయసింహ, వలసల మంజు, గాదిభాస్కర, మునగమాను రెడ్డిశేఖర్, బొంతసోమశేఖర్, ఆరవ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

పెద్దతిప్పసముద్రం: ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాంప్రసాద్ రెడ్డికి మద్దతుగా వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ మహమూద్, సచివాలయ మండల కన్వీనర్ డ్రిప్ రమణ, సర్పంచ్ శంకర్, ఎంపీటీసీ చంద్రశేఖర్, మహబూబ్‌బాషా, శివారెడ్డి తదితరులు మండల పరిషత్, రెవెన్యూ, ఎంఈఓ కార్యాలయంతో పాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, సచివాలయ సిబ్బందిని కలసి శ్యాంప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు.

ప్రతి ఇంటింటికీ సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: ప్రతి ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గృహసారథులు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పనితీరును అవగతం చేసుకుని 'జగనన్నే మా నమ్మకం' కార్యక్రమాన్ని ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. సోమవారం స్థానిక సీఏ మహాల్‌లో గృహసారథులు, కన్వీనర్లకు శిక్షణ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో పాటు పీలేరు నియోజకవర్గ పరిశీలకులు సహదేవ రెడ్డి, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్ రూపొందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో వలంటీర్లు నూరుశాతం సఫలీకృతులయ్యారని సంతోషం వ్యక్తం చేశారు. నిబద్ధతతో విధులు నిర్వహించే గృహసారథుల వివరాలు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వద్ద ఉన్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కుల, మత, పార్టీల రహితంగా సంక్షేమాన్ని అందిస్తుందన్న ఈ విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నిర్మల, సర్పంచ్ గంగులమ్మ, వైస్ ఎంపీపీ వెంకట్రమణ, కిరణ్ కుమార్, ఏఎంసీ చైర్మన్ రవి నాయక్, నాయకులు చింతల శివానంద రెడ్డి, నీళ్లభాస్కర్, నరసింహులు, కేశవ రెడ్డి, ఓరుగంటి రమేష్, లక్ష్మీనారాయణరెడ్డి, అబ్దుల్‌కలీమ్, రాయుడు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

మదనపల్లె : రోడ్డుప్రమాదంలో స్కూటరిస్టు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం కలకడ మండలంలో జరిగింది. తంబళ్లపల్లె మండలం రేణుమాకులపల్లె పంచాయతీ చెరువుకింద పల్లెకు చెందిన పూజారి రామనాథ్(45) గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం కలకడ ఝరికోనలో జరుగుతున్న శ్రీ సిద్దేశ్వరస్వామి తిరునాలకు ద్విచక్ర వాహనంలో వెళ్లాడు. అక్కడ నుంచి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో ఎదురుగా వస్తున్న ఆటో ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రామనాథ్‌ను 108 అంబులెన్స్‌లో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కలకడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు

కలికిరి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మూడు రోజులుగా జరిగిన ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. పట్టణ పరిధిలోని శ్రీసోమేశ్వరాలయంలో సోమవారం స్వామి వారి అమ్మవార్ల ఊంజల్ సేవ, ఏకాంత సేవ, త్రిశూల స్నానం నిర్వహించారు. భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్ల సేవలో పునీతులయ్యారు. మహిళలు దీపారాధన చేశారు.

యాళివాహనంపై సిద్దేశ్వరుడు

కలకడ : యాళివాహనంపై శ్రీకామాక్షి సమేత సిద్దేశ్వరస్వామి వారు ఊరేగింపుగా ఇంటింటి పూజలు అందుకున్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెడ్డిసంఘం కులస్తులకు కేటాయించిన యాళివాహనంపై అలంకరించిన చాందినీ బండిపై స్వామివారిని ఊరేగింపు నిర్వహించారు.

ఘనంగా ఓదేటి యల్లమ్మ జాతర

పీలేరు రూరల్ : మండలంలోని ముదుపులవేముల పంచాయతీ రెడ్డివారిపల్లె, పింఛానది ఒడ్డున వెలసిన ఓదెటియల్లమ్మ జాతరను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం నుంచి అమ్మవారికి విశేష పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో మంగళవాయిద్యాల నడుమ ఘనంగా ఊరేగించారు. రాత్రి చాందినీ బండ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేపట్టి మొక్కులు చెల్లించారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

కలికిరి: ఛత్రపతి శివాజీ జయంతిని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక అయ్యప్ప ఆలయం వద్ద నుంచి గాంధీ కూడలి వరకు ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. కలికిరి వారపు సంతలో అన్నదానం చేశారు. వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి చింతపర్తి మహేష్, గుండ్రాజుపల్లి శ్రీనివాసులు, జిల్లా గోరక్షప్రముఖ్ హరిప్రతాప్ రాజు, వీహెచ్‌పీ కార్యకర్తలు కృష్ణప్రతాప్‌రాజు, శంకర, భారతమ్మ, ధీరజ్, గణేష్ పాల్గొన్నారు.

నిత్యావసరాలు సక్రమంగా పంపిణీ చేయాలి

కలికిరి: డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు నిత్యావసరాలను వినియోగదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దారు భాగ్యలత అన్నారు. సోమవారం మండల పరిధిలోని రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో పౌరసరఫరాల శాఖ డీటీ నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : మండలంలోని ముదుపులవేముల పంచాయతీ తానావడ్డిపల్లె, రాయలవారిపల్లె, కుమ్మరపల్లెకు చెందిన 20 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మాజీ సర్పంచ్ హరినాథ, ఓ. గంగరాజు, బి. రమణ, బి. కృపకుమార్, రెడ్డికుమార్, శ్రీనివాసులు, దేవేంద్ర, వారి అనుచరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్ రాజేష్, లోకనాథరెడ్డి, ఎంపీటీసీ చెంగల్‌రాయుడు తదితరులు పాల్గొన్నారు.

మా నమ్మకం నీవే జగన్ నినాదంతో ముందుకు సాగుదాం

పీలేరు : వచ్చే ఎన్నికల్లో విజయభేరి మోగించడమే లక్ష్యంగా 'మా నమ్మకం నీవే జగన్' అన్న నినాదంతో ముందుకు సాగుదామని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంఎం ఫంక్షన్ హాల్‌నందు గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ చిత్ర పటానికి పూలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ సచివాలయం, గ్రామ వలంటీర్ల వ్యవస్థతో ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా ప్రజలకు అందించడం జరుగుతోందని తెలిపారు. ప్రభుత్వ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు చేరవేయడం తోపాటు వైఎస్సార్‌సీపీ బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సరికొత్త ఆలోచనతో గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులను నియమించే కార్యక్రమం తీసుకొచ్చారని తెలిపారు పార్టీకోసం కష్టపడి పని చేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకులు సహదేవరెడ్డి, ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ ఆనంద్, జెడ్పీ కోఆప్టెడ్ సభ్యుడు షఫీ, సింగిల్‌విండో అధ్యక్షుడు బి.డి. నారాయణ, డీసీసీబీ డైరెక్టర్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

గోల్డెన్ యారో అవార్డుకు స్కౌట్ విద్యార్థులు



గోల్డెన్ యారో ర్యాలీలో జిల్లా విద్యార్థులు

కురబలకోట: జాతీయ స్థాయి గోల్డెన్ యారో అవార్డుకు అన్నమయ్య జిల్లా నుండి ఎంపికైన ఆరుగురు స్కౌట్ విద్యార్థులు సోమవారం హర్యానా రాష్ట్రం దద్పురి పాల్వాల్ జరిగిన ర్యాలీకి ప్రాతినిధ్యం వహిస్తూ పాల్గొన్నారు. కురబలకోట మండలం నార్లపల్లె ప్రాథమిక పాఠశాల నుంచి బి.భువనేష్ కుమార్‌రెడ్డి, దిగువ చెన్నామర్రి స్కూల్ నుండి బి.చరిత్ర రెడ్డి, బి. కార్తీక్, వాల్మీకిపురం మండలం ప్యారంపల్లె స్కూల్ నుంచి ఎస్. శ్రీనివాసులు, బి.అభిషేక్, మదనపల్లె మండలం బాబు నగర్ స్కూల్ నుంచి ఎస్. నవీన్ కుమార్ గోల్డెన్ యారో అవార్డుకు ఎంపికైన విషయం తెలిసిందే. వీరు జాతీయ స్థాయిలో హర్యానాలో జరుగుతున్న అవార్డు ఉత్సవంలో పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని మహిళకు గాయాలు

కలకడ : ద్విచక్ర వాహనం ఢీకొని మహిళకు తీవ్ర రక్త గాయాలైన సంఘటన మండలంలోని కె.బాటవారిపల్లెలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఆదివారం రాత్రి మండలంలో కె.బాటవారిపల్లె గ్రామానికి చెందిన కలకడ నాగార్జున భార్య కె.నాగరత్న చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై కలకడ వైపు వస్తుండగా కెవిపల్లె మండలం టి.రాజుపల్లె గ్రామానికి చెందిన జి.జయచంద్ర ద్విచక్రవాహనంతో ఢీ కొన్నాడు. ప్రమాదంలో నాగరత్న తీవ్రంగా గాయపడింది. పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హుండీ ఆదాయం రూ.1.40 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు

నిమ్మనపల్లె : మండలంలోని తవలం గ్రామం నేల మల్లేశ్వరస్వామి హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. రూ.1,40,622 ఆదాయం లభించినట్లు ఈఓ మంజుల తెలిపారు. దేవదాయశాఖ అధికారి రవికుమార్ పర్యవేక్షణలో హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు చెప్పారు. వచ్చిన ఆదాయాన్ని ఇండియన్ బ్యాంక్ ఖాతాలో జమచేశామన్నారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ రమణారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, ఆలయ తాత్కాలిక కార్యవర్గసభ్యులు,సర్పంచ్, అర్చకులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని వినతి

మదనపల్లె : మండలంలోని కొత్తపల్లె పంచాయతీలోని అక్రమ లేఅవుట్లపై పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని మాలమహానాడు నాయకులు ఎంపీడీఓ కార్యాలయ ఏఓ రెడ్డెమ్మకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తపల్లె పంచాయతీ గ్రామసచివాలయం వెనుకవైపు మూడు ఎకరాల భూమిలో వేసిన లేఅవుట్‌కు కన్వర్షన్, బెటర్‌మెంట్ చార్జీలు చెల్లించకపోయినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అలాగే మూడునెలలుగా ఇదే పంచాయతీలో నాలుగు సర్వేనెంబర్లలో లేఅవుట్లు వేసినప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పంచాయతీకి రావాల్సిన 10శాతం భూమితో పాటుగా ఆదాయం కోల్పోవడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో గుండామనోహర్, మల్లెలమోహన, చంద్రయ్య పాల్గొన్నారు.